సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం | 3 | జూన్ | 2024



పిల్లలకు జిమ్ 8లో

పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కులో వీఎంఆర్‌డీఏ అధికారులు పిల్లల కోసం ప్రత్యేకంగా జిమ్‌ను ఏర్పాటు చేశారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

సహజసిద్ధ అందాలకు నిలయం లంబసింగి



ధ్యాన శిబిరంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సాధకులు

చింతపల్లిరూరల్: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు, ప్రశాంతతకు ఆంధ్రా కశ్మీర్ లంబసింగి నిలయమని బెంగళూరు ఆశ్రమానికి చెందిన యోగా గురువు జగదీష్ శాస్త్రి, కర్మయోగ కోఆర్డినేటర్ అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలో బౌడ శివాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల ధ్యాన సాధన శిబిరం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గుంటూరు, శ్రీకాకుళం, జంగారెడ్డిగూడెం, విశాఖపట్నం, తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన 27 మంది సాధకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆధ్యాత్మిక ధ్యాన శిబిరం ఏర్పాటు చేసిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులకు బౌడ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మోదమ్మ దర్శనానికి భారీగా భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడి వద్ద మోదమ్మ భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. కొంతమంది భక్తులు మైదాన ప్రాంతం నుంచి కాలినడకన పాదాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.


ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిత్రం యూనిట్ సభ్యులు

ఈనెల 9నుంచి మూడు రోజుల పాటు పాడేరులో జరిగే మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు సంబంధించి ప్రచార పోస్టర్లను ఆదివారం 12వ మైలు రాయి చిత్రం యూనిట్ ఆవిష్కరించింది. శ్రీలక్ష్మి గణపతి మూవీ మేకర్స్ బ్యానర్ 2వ చిత్రం 12వమైలురాయి షూటింగ్ స్థానిక గబ్బంగి తోటల్లో జరుగుతోంది. ఈమేరకు చిత్ర దర్శకుడు ఎస్‌కే, హీరోయిన్ సువాన, బాహుబలి ప్రభాకర్, జబర్దస్త్ నవీన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు తదితరులు ఆవిష్కరించారు.


మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ



ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

కొయ్యూరు: మావోయిస్టులు అల్లూరి జిల్లాను వదిలివెళ్లాలని, ఈ ప్రాంతానికి రావొద్దని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కొయ్యూరు సంతలో వారు ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. మావోయిస్టుల వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని విమర్శించారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా పలు గ్రామాల నుంచి వచ్చిన వారు పోలీసుల సహకారంతో సంత ప్రాంగణం నుంచి కొంత దూరం ర్యాలీ నిర్వహించారు. ఎప్పుడో రావలసిన రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు మావోయిస్టుల మూలంగా రాకుండా పోయాయన్నారు. ఇప్పుడు గ్రామాల్లో నిర్మించిన టవర్లు, ఇతర కట్టడాలకు నష్టం కలిగించరాదని వారు హితవు పలికారు.

చిరు జల్లులతో ఉపశమనం



అప్పలరాజుపేట ప్రాంతంలో కురుస్తున్న చిరు జల్లులు

రాజవొమ్మంగి: కొంతకాలంగా ఎండ తీవ్రతతో సతమతమైన ప్రజలకు ఆదివారం చిరుజల్లులతో చల్లబడిన వాతావరణం ఉపశమనం ఇచ్చింది. రాజవొమ్మంగి పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వేసవి దుక్కులకు మెత్తబడిన వ్యవసాయ భూములకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపయోగకరమని రైతులు తెలిపారు.

పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షలో జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత
- పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని వెల్లడి



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమీక్షకు హాజరైన జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత, పాడేరు ఆర్వో భావన వశిష్ట, డీఆర్వో పద్మావతి



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న పరిశీలకులు వివేకానందన్, గజేంద్రకుమార్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత

సాక్షి,పాడేరు: జిల్లాలోని పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు సంబంధించి మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఆదివారం జిల్లా అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత మాట్లాడుతూ పాడేరు, అరకులోయ అసెంబ్లీ సెగ్మెంట్‌లకు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రంపచోడవరం సెగ్మెంట్‌కు రంపచోడవరం జూనియర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. అరకులోయలో 304 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపునకు 14టేబుళ్లు, పాడేరులో 318 పోలింగ్ కేంద్రాలకు 14టేబుళ్లు, రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాలకు 20 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అరకులోయలో 22 రౌండ్లు, పాడేరుకు 23 రౌండ్లు, రంపచోడవరానికి 20 రౌండ్లు చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు. ముందుగా అరకులోయలో 3,492, పాడేరులో 2546, రంపచోడవరంలో 4123 పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పాడేరు అసెంబ్లీ ఆర్వో భావన వశిష్ట, డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు కౌంటింగ్ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఓట్ల లెక్కింపు పరిశీలకులు కె.వివేకానందన్, గజేంద్రకుమార్‌సింగ్ ఆదేశించారు. ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాలలోని పాడేరు,అరకుఅసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. ముందుగా స్ట్రాంగ్ రూమ్‌ల ఆవరణలో పోలీసు బందోబస్తుపై సమీక్షించారు. లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అన్ని ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత, పాడేరు ఆర్వో భావన వశిష్ట సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి పొరబాట్లు లేకుండా జాగ్రత్తగా మెలగాలని సూచించారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను చూపించి, సంతకాలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది నాలుగో తేదీ ఉదయం ఐదు గంటలకు లెక్కింపు కేంద్రాలకు కచ్చితంగా చేరుకోవాలని సూచించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడి అయ్యేవరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉదయం 8గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం ఈవీఎంల లెక్కింపు చేపడతామన్నారు. ప్రతీ టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజరు, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో పరిశీలకులు ఉంటారని, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించి ఏఆర్వో, కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రో పరిశీలకులు ఉంటారని ఆమె తెలిపారు. చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య, డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీలు అంబేద్కర్, పద్మావతి పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

జి.మాడుగుల: జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామ స్థాయి సుపరిపాలన అందించటానికి చేపట్టిన సంస్కరణలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలింటీర్ల వ్యవస్థలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్న వడ్డీ రుణాల వంటి పథకాలతో మహిళలకు ఆర్థిక ఆసరా లభించిందన్నారు. అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మ తనుజా రాణి, పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఆమె పేర్కొన్నారు.

కేశవ స్వామికి లక్ష పత్రిపూజ



పూజ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ, కుటుంబ సభ్యులు

చోడవరం: స్థానిక ప్రాచీన దేవాలయంలో కేశవ స్వామివారికి ఆదివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కుటుంబ సమేతంగా ఈ పూజలో పాల్గొన్నారు. తులసి, కుంకుమతో ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు ఈ పూజ చేశారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

పాడేరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే ఎన్నికల కౌంటింగ్ పక్రియకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్ తెలిపారు. ఆదివారం పాడేరులో ఆయన అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, పాడేరు, చింతపల్లి సబ్ డివిజనల్ సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు. సీఆర్‌పీఎఫ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నిర్వహించాల్సిన బందోబస్తుపై పలు సలహాలు, సూచనాలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రవేశించాలంటే తప్పనిసరిగా ఎన్నికల అధికారి జారీ చేసిన పాస్‌లు, ఐడీ కార్డులు కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఎల్రక్టానిక్ పరికరాలు, పెన్నులు, కాగితాలు, వాటర్ బాటిళ్లను అనుమతించవద్దన్నారు. వాహనాలపై వచ్చే అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు, ఇతర సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా 144 సీఆర్పీ సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రతి ఒక్కరు కచ్చితంగా ఎన్నికల నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కచ్చితంగా పాటించాల్సిందే..



విలేకరులతో మాట్లాడుతున్న పాడేరు సీఐ నవీన్‌కుమార్

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రతి ఒక్కరు ఈసీ విధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పాడేరు సీఐ నవీనకుమార్ హెచ్చరించారు. ఆదివారం తన కార్యాలయంలో పాడేరు ఎస్ఐ లక్ష్మణరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు తప్ప ఇంకెవరు కౌంటింగ్ రోజున పాడేరు రావొద్దన్నారు. ర్యాలీలు, ప్రదర్శనలకు ఎటువంటి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ రోజున వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

- ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, హుకుంపేట మార్గాల నుంచి వచ్చే వాహనాలు అడారిమెట్ట జంక్షన్ మీదుగా వంతాడపల్లి చెక్ పోస్ట్ దరి విశాఖపట్నం, జి.మాడుగుల ప్రాంతాలకు వెళ్లాలి
- జి.మాడుగుల ప్రాంతం వైపు నుంచి విశాఖపట్నం, అరకు, పెదబయలు మార్గాల వైపు వెళ్లే వాహనదారులు గొందూరు సెయింటాన్స్ పాఠశాల నుంచి నక్కలపుట్టు, వంతాడపల్లి చెక్‌పోస్టు మీదుగా చేరుకోవాలి.
- విశాఖపట్నం నుంచి అరకు, పెదబయలు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వంతాడపల్లి చెక్ పోస్టు నుంచి అడారిమెట్ట మీదుగా వెళ్లాలి.
- విశాఖపట్నం నుండి జి. మాడుగుల ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు నక్కలపుట్టు నుంచి గొందూరు సెయింటాన్స్ స్కూల్ మీదుగా ప్రయాణం సాగించాలి.
- ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే హెవీ లోడ్ వాహనాలకు 3,4 తేదీల్లో ఎటువంటి అనుమతులు లేవు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రంపచోడవరంలో ట్రాఫిక్ ఆంక్షలు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో రంపచోడవరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు. కౌంటింగ్ రోజు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా బోర్నగూడెం గ్రామం వైపు నుంచి దేవీపట్నం వరకు ఉన్న గ్రామాల ప్రజలు రంపచోడవరం వేరే మార్గాల్లో రావాల్సిందిగా సూచించారు. రంపచోడవరంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున నియోజకవర్గంలోని ప్రజలు ఎవరు బయట గ్రామాల నుంచి రంపచోడవరం రావద్దన్నారు. నలుగురు వ్యక్తులు కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగకూడదన్నారు. రంపచోడవరంలో ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. బయట గ్రామాల ప్రజలు రంపచోడవరం రాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

27 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు



అనంతగిరి సీహెచ్‌సీలో ఆపరేషన్లు చేస్తున్న వైద్యాధికారులు జ్ఞానేశ్వరి, శిరీష

అనంతగిరి: పీహెచ్‌సీల్లో ఆదివారం 27మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామని, అనంతగిరి, కిలగాడ వైద్యాధికారులు జ్ఞానేశ్వరీ, శిరీష తెలిపారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునేందుకు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రభుత్వం ప్రత్యేకచొరవతో తొలిసారిగా పీహెచ్‌సీ పరిధిలోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామన్నారు. అలాగే ఆపరేషన్లు చేయించుకున్న మహిళలకు అవగాహన కల్పించి, వైద్యసేవలను అందించామన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న మహిళలకు అకౌంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నగదును వేస్తుందన్నారు. అలాగే ఆస్పత్రి పరిధిలోని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపడుతున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని వారు కోరారు.

అడుగంటుతున్న ఆశలు

- వట్టిపోయిన వట్టిగెడ్డ జలాశయం
- ఆయకట్టుదారుల్లో ఆందోళన
- మరమ్మతులకు ప్రతిపాదనలు



వెలవెలబోతున్న వట్టిగెడ్డ జలాశయ గర్భం

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట శివారు వట్టిగెడ్డ జలాశయం దాదాపుగా అడుగంటింది. దీంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారనుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జలాశయ గరిష్ట నీటిమట్టం 16 అడుగులు. ప్రస్తుతం అర అడుగు మాత్రమే నీరు ఉంది. మరోపక్క షట్టర్లు (తలుపులు) తుప్పుపట్టి రంధ్రాలు పడటంతో జలాశయ గర్భంలో నీరు ఎప్పటికప్పుడు దిగువకు వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు. ఈ జలాశయంపై అప్పలరాజుపేట, రాజవొమ్మంగి, దూసురపాము, డి.మల్లవరం, చంటికొండ, వట్టిగెడ్డ గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల ఎకరాలు ఆధారపడ్డాయి. గత ఖరీఫ్‌లో వర్షాలు పుష్కలంగా కురవడం వల్ల ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందింది. అప్పటిలో సాగుకు వినియోగించగా మిగిలిన నీరు షట్టర్ లీకేజీల నుంచి వృథాగాపోవడంతో జలాశయం ఖాళీ అయింది. దీనివల్ల ఆయకట్టుకు నీరు విడుదల చేయాలన్నా.. జలాశయంలో నిల్వ చేయాలన్నా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చిన్నతరహా నీటిపారుదల శాఖ అధికారులు తక్షణం స్పందించి డ్యామ్ షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

వట్టిగెడ్డ రిజర్వాయర్ మరమ్మతులు, పూడిక తీత పనులకు రూ. 33.48 లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇందుకు ఐటీడీఏ పీవో ఆమోదం తెలిపారు. నిధులు విడుదల అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– కె.సుబ్బయ్య, ఈఈ, మైనర్ ఇరిగేషన్, రంపచోడవరం

పాపికొండలకు పర్యాటకుల తాకిడి



వ్యూ పాయింట్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

వీఆర్‌పురం: పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం పోచవరం బోట్ పాయింట్‌కు అధిక సంఖ్యలోతరలివచ్చారు వేసవి సెలవులు కావడంతో గతవారం నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారని బోట్ యూనియన్ నాయకులు తెలిపారు. ఆదివారం 12 బోట్లలో 608 మంది పర్యాటకులు పాపికొండల వీక్షణకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్ రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్ ,పేరంటాలపల్లి శివాలయం తదితర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

గాలికొండకు..



బోట్ పాయింట్‌లో పర్యాటకుల వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఘాట్‌రోడ్డులోని గాలికొండ వ్యూపాయింట్‌కు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ఈ ప్రాంతాలను సందర్శించేందుకు ఆదివారం కుటుంబ సమేతంగా భారీగా తరలివచ్చారు. ఘాట్ రోడ్డుతో పాటు సుంకరమెట్ట కాఫీ తోటలను సందర్శించారు. ఆహ్లాదకర వాతావరణంలో హాయిగా గడిపారు.

నాడు బూటు చప్పుళ్లు..
నేడు ప్రగతికి ఆనవాళ్లు

- మారిన మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజరి పంచాయతీ రూపురేఖలు
- రూ.26.3 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం
- సుమారు 70 గ్రామాలకు ఉపయోగకరం
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గిరిజనులు

ఇంజరి పంచాయతీ.. ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత ప్రాంతం..అభివృద్ధికి దూరం.. మావోయిస్టులు, పోలీసులు బూటు చప్పుళ్లతో నిత్యం భయంభయం.. అటువంటి ప్రాంతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో ఇప్పుడు ప్రగతికి కేరాఫ్‌గా మారిపోయింది. ఈ పంచాయతీలో గ్రామాలకు నిర్మించిన రింగ్‌రోడ్డు ఏజెన్సీకి తలమానికంగా నిలిచింది.



ఇంజరి పంచాయతీలో ఆకట్టుకుంటున్న మద్దిగరువు-కొండ్రుం ఘాట్ రోడ్డు


సాక్షి,పాడేరు: ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డాగా ఉన్న పెదబయలు మండలం ఇంజరి పంచాయతీలో ప్రగతి పూలు వికసిస్తున్నాయి. రహదారి సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి కాలినడకన మద్దిగరువు సంతకు చేరుకుని నిత్యావసరాలు కొనుగోలు చేసుకునేవారు. అత్యవసర పరిస్థితుల్లో గుర్రాలు, డోలీలపై ఆధారపడేవారు. ఇలా కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మౌలిక వసతులపై దృష్టి సారించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందించింది. రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.26.3 కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో జి.మాడుగుల మండలం మద్దిగరువు నుంచి చీకుపనస, జక్కం, వనబరి, కొండ్రుం మీదుగా, పెదబయలు మండలంలోని గుల్లెలు మీదుగా ఇంజరి పంచాయతీకి 30.9 కిలోమీటర్ల పొడవునా 70 మారుమూల గ్రామాలకు సౌకర్యవంతంగా రింగ్‌రోడ్డును నిర్మించింది. కొండగెడ్డలపై అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించడంతో వరదలు వచ్చినా గిరిజనుల ప్రయాణం సాఫీగా సాగుతోంది.మెలికలు తిరిగిన ఈ రోడ్డు ఈ ప్రాంత సందర్శనకు వచ్చే వారిని ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసి గిరిజన పక్షపాతిగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామని ఇంజరి పంచాయతీ గిరిజనులు ఆనందంతో తెలిపారు.



వనబరి గ్రామ సమీపంలోని తారురోడ్డు



గుల్లెలు- ఇంజరి తారురోడ్డు



ఇంజరి రోడ్డులో పెద్ద గెడ్డపై నిర్మించిన కాజ్‌వే

క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభం

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి సారిగా ఆన్‌లైన్‌లో సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనం ప్రారంభమైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రోజు తెలుగు, ఇంగ్లీష్, హిందీ పేపర్లను దిద్దారని చెప్పారు. ప్రతి పేపరును రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న జూనియర్, సీనియర్ అధ్యాపకులతో రెండుసార్లు మూల్యాంకనం చేయిస్తున్నామని పేర్కొన్నారు.

నేటి పాలిసెట్ కౌన్సెలింగ్ 6వ తేదీకి మార్పు


పాలిసెట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

తుమ్మపాల: మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ 7వ రోజు ఆది వారం కూడా కొనసాగింది. 92,001 నుంచి 1,08,000 ర్యాంక్ మధ్య గల 91 మంది విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఐసీఆర్ పత్రాలు పొందారని కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో బాలురు 65 మంది, బాలికలు 26 మంది ఉన్నారన్నారు. 1,08,001నుంచి ఆఖరి ర్యాంకు వరకు సోమ వారం జరగనున్న కౌన్సెలింగ్ ప్రక్రియ సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈనెల 6వ తేదీకి మార్పు చేసినట్టు చెప్పారు. వెబ్ ఆప్షన్లు ఈనెల 7 నుంచి 10 వరకు పెట్టుకోవచ్చని, మార్పులకు 11న అవకాశం ఉందన్నారు. 13న సీట్ల అలాట్‌మెంట్ జరుగుతుందని, 14 నుంచి 19వ తేదీ వరకు కళాశాల్లో జాయినింగ్ రిపోర్టు సమర్పించి తరగతుల్లో చేరవచ్చన్నారు.

పిల్లలకు జిమ్

ఆరిలోవ (విశాఖ): పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కులో వీఎంఆర్‌డీఏ అధికారులు పిల్లల కోసం ప్రత్యేకంగా జిమ్‌ను ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అధికారులు నగరంలో పార్కులు, ఖాళీ స్థలాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ జిమ్‌లు పెద్దలకు వీలుగా ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ మాత్రం ఇక్కడ పిల్లల సౌకర్యార్థం జిమ్ పరికరాలు అందుబాటులో ఉంచింది. తెన్నేటి పార్కు సందర్శనకు వెళ్తున్న చిన్నారులు ఈ జిమ్ పరికరాల వద్ద సాధన చూస్తూ సందడి చేస్తున్నారు. పిల్లల తమ ఎత్తును బట్టి వారికి అనుకూలంగా ఉండే పరికరాలను వినియోగించుకుంటున్నారు. సాయంత్రం సమయాలలో ఈ జిమ్ పరికరాల వద్ద రద్దీ ఎక్కువగా ఉంటోంది.

మన్యం తాండ్రకు గిరాకీ


తాండ్ర తయారీకి చేటలలో ఆరబెడతున్న మామిడిపండ్ల రసం


మామిడి రసాన్ని తయారీ కోసం ఎండబెడుతున్న గిరిజన మహిళ

- కొండమామిడి పండ్లతో తయారీ
- వారపు సంతల్లో అమ్మకాలు

ముంచంగిపుట్టు: మన్యంలో అటవీ ప్రాంతాల్లో లభించే మామిడిపండ్లతో తమారుచేసే తాండ్ర రుచిగా ఉంటుంది. దీంతో తాండ్రకు మంచి గిరాకీ నెలకొంది. విశాఖ మన్యంలో గిరిజన గ్రామాల్లో ప్రస్తుతం ఇళ్ల ముందు చేటలు, చాపలు ,ప్లేటులతో మామిడి తాండ్ర తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వారపు సంతలో తాండ్ర కిలో రూ.100 నుంచి రూ.120 వరకూ ధర పలుకుతున్నా ఎంతో రుచిగా ఉండడంతో ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మామిడిపండ్ల సీజన్ అయిపోయినా తాండ్రను భద్రపరుచుకొని తినే అవకాశం ఉండడంతో డిమాండ్ నెలకొంది. కొనుగోలుదారుల మక్కువ చూపడంతో గిరిజన మహిళలు తాండ్రను మరింత ఉత్పత్తి చేయడానికి కృషి చేస్తున్నారు.

సహజసిద్ధంగా తాండ్ర తయారీ

మన్యంలో గిరిజన గ్రామాలకు అనుకొని ఉన్న అటవీ ప్రాంతాల్లో మామిడి చెట్లకు కాసే కొండ మామిడి పండ్లను ఇంటిల్లపాది ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లి మామిడి పండ్లను సేకరించి వాటిని శుభ్రపరుస్తారు. తరువాత పెద్ద డబ్బాలు, బిందెలలో వేసి రోకలితో దంచుతారు.దంచగా వచ్చిన మామిడి రసాన్ని చేటలు, ప్లేట్లు, చాపలులో పలుచగా వెదజల్లేలా ఆరబెడతారు. వీటిలో ఎటువంటి రసాయనాలు కలుపకుండానే పొరలు, పొరలుగా వేసి వారం, పది రోజులుగా ఆరబెట్టి తాండ్రను తయారు చేస్తారు.

మామిడి పండ్లతో పలు తయారీలు

మామిడి పండ్లను ఒక డబ్బాలో వేసి రోకలితో దంచగా వచ్చిన రసాన్ని తాండ్రగా తయారు చేయగా మిగిలిన మామిడి తొక్కలను,టెంకలను వేరు చేసి ఎండబెడతారు.తొక్కలను కొందరు కారంతో, మరి కొందరు బెల్లంతో కలిసి ఎండ బెడతారు. బాగా ఎండిన తర్వాత వీటిని డబ్బాలలో నిల్వ చేసుకుంటారు. ఏడాది పొడవునా గెంజి అన్నంతో పచ్చడి మాదిరిగా వినియోగిస్తూ తింటారు. కొన్ని గ్రామాల్లో మామిడి టెంకలను ఎండబెట్టి పిండిగా చేస్తారు.దీన్ని ఉడగబెట్టి అంబలిగా చేసుకొని గిరిజనులు ఆరగిస్తారు. మామిడి పండ్ల టెంకలతో కూరను కూడా తయారు చేస్తారు.టెంకలతో తయారు చేసే కూరను ఇష్టంగా తీసుకుంటారు.

పెరుగుతున్న ధరలు

మన్యంలో గిరిజనులు తయారు చేసే తాండ్రకు మంచి గిరాకీ ఉంది. తాండ్రను మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కిలో రూ.100 నుంచి రూ.120 వరకు కొనుగోలు చేస్తున్నారు.ఎటువంటి రసాయనాలు కలుపకుండా తయారు చేయడంతో డిమాండ్ ఉంది. మన్యం ప్రాంత తాండ్రపై వ్యాపారులు మక్కువ చూపిస్తున్నారు.తాండ్రను ముక్కలుగా చేసి సైతం వ్యాపారలు ముక్కను రూ.10ల చొప్పున అమ్మకాలు చేస్తున్నారు.మామిడి తాండ్రతో పాటు పలు రకాలుగా మామిడి పండ్లు గిరిజనులకు ఆర్థికంగా ఉపయోగపడుతుంది.

ఆర్థికంగా చేయూత

ప్రతి ఏడాది మామిడి మా కుటుంబాలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. మొదటిలో మామిడి తాండ్రను ఇంట్లో వాడకం కోసం మాత్రమే తయారు చేసేవారం. వారపు సంతలో తాండ్రకు డిమాండ్ పెరగడంతో అమ్మకాలకు తయారు చేస్తున్నాం. కొంత మంది వ్యాపారులు ఇంటికి వచ్చి మరి తాండ్రను కొనుగోలు చేస్తున్నారు. సహజసిద్ధంగా తాండ్ర తయారు చేయడం, మంచి రుచిగా ఉంటుంది.ఆర్థికంగా కూడా తాండ్ర మాకు చేయూతను ఇస్తుంది.

– వి.మహేశ్వరి, సుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం , మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.


స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకుడు


నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

నవ్వులు పంచిన వినోదాల విందు

విశాఖ: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను సత్కరించారు.


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

'దర్శిని' బృందానికి అభినందనలు


సినిమా బృందాన్ని సత్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం దర్శిని సినిమా బృందం అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి మీడియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దర్శకులు, నటీనటులను ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర యువ దర్శకుడు, నటులు ఇక్కడ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నిర్మించిన చిత్రం దర్శిని అని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల విడుదలై ఆదరణ పొందుతోందన్నారు. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధికి అన్ని వనరులు ఉన్నాయని, ప్రభుత్వాలు చొరవ తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. చిన్న చిన్న సినిమాలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం దర్శకుడు డాక్టర్ ప్రదీప్ అల్లు, నిర్మాత ఎల్.వి.సూర్యం, సహాయ దర్శకుడు కె.సంతోష్, నటులు ఎస్.వి.సత్యప్రసాద్, నవీన్, సౌండ్ ఇన్‌చార్జి వేదరాము, సిద్ధార్థలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దర్శిని చిత్రాన్ని ప్రదర్శించి, నటీ నటులతో ముఖాముఖి నిర్వహించారు. రంగసాయి మీడియా ప్రతినిధి బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు, హేమ, జమ్మా చిన్నబాబు, సొసైటీ ప్రతినిధులు బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, ఉషారాణి, ప్రభు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

50 వేల గాజులతో నూకాంబికకు అలంకరణ

దర్శనానికి పోటెత్తిన భక్తులు


గాజుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారికి ఆదివారం వైశాఖమాసం ఏకాదశి రేవతి నక్షత్ర సందర్భంగా భక్తుల సహకారంలో 50వేల గాజులతో అలంకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిల్లపాపలతో అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూకాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రెడ్ జోన్‌లోనూ అక్రమంగా మద్యం అమ్మకాలు

క్వార్టర్ బాటిల్‌కు రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు

తుమ్మపాల: ఒకవైపు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు అతి సమీపంలో స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రానికి చుట్టు పక్కల రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి తూట్లు పొడుస్తూ శంకరం, రేబాక, గురజాడ నగర్, బట్లపూడి, గొలగాం, రాయుడుపేట గ్రామాల్లో యథేచ్ఛగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకుని శంకరం, రేబాక జంక్షన్లలో అన్ని షాపులూ అక్రమ మద్యానికి కేరాఫ్‌గా మారాయి. ఈ నెల 3, 4, 5 తేదీల్లో ప్రభుత్వం మద్యం అమ్మకాలు నిలిపివేసింది. ఇదే అవకాశం చేసుకుని ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 నుంచి రూ.80 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక్కడకు సమీపంలోని అబ్కారీ శాఖ మద్యం గొడౌన్‌లో కళాసీల ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని అక్రమ మార్గంలో తరలించి ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం మూడు బాటిళ్ల కన్నా ఎక్కువ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మద్యాన్ని కల్తీ చేస్తూ గొలుసుకట్టు విధానంలో అమ్ముతున్నారు. వీటిపై చూడకుండా కొందరి పోలీసులకు నెలవారీ మామూళ్లు సమర్పించి మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అల్లూరి శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఏర్పాటు

దాబాగార్డెన్స్ : స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కంచరపాలెంలో నిర్వహించిన సమావేశంలో వార్షిక నిర్వహణ కమిటీ ఏర్పడింది. సమావేశంలో ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సలహాదారు డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకుడు పడాల వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అల్లూరి శత వర్ధంతిని ఏడాది పాటు నిర్వహించేందుకు సలహాలు, సూచనలు స్వీకరించారు. అల్లూరి జయంతి, వర్ధంతులు సాంప్రదాయ రీతిన నిర్వహించడమే కాక నేటి తరాలకు అల్లూరి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా చూపించాలని వక్తలు సూచించారు. అల్లూరి జీవితం, పోరాటంపై ఓ పుస్తకాన్ని ప్రచురించి విద్యార్థులు, యువతలో విస్తృతంగా పంపిణీ చేయాలని, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని, జూలై 4న అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. 20 మందితో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా పడాల వీరభద్రరావు, అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. గోవిందరాజులు ఎన్నికయ్యారు. సమావేశంలో సివంగి నాగేశ్వరరావు, శ్యామల, వరలక్ష్మి, ఎం. శరత్, సీహెచ్ ప్రమీల, పి. వేంకటేశ్వరరావు, వి. నాగారుసరాజు, పల్లా భాస్కరమణి, విద్యార్థులు అభిలాష్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ పర్యావరణ, స్పోర్ట్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్‌ర్యాలీని ఉక్కునగరం త్రిష్నా మైదానంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. లక్షలాది మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సైకిల్ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్నా మైదానానికి చేరుకుంది. బాలబాలికలు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసే ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి మాటున కాటేసిన మృత్యువు

- రాత్రి వేళ అదుపు తప్పిన బైక్
- ఇద్దరు యువకుల దుర్మరణం మరణంలోనూ వీడని స్నేహం


దామరౌతు ఈశ్వరరావు (ఫైల్)


తూరిబిల్లి భాస్కరరావు (ఫైల్)


సంఘటన స్థలంలో మృతదేహాలు

కశింకోట: మండలంలో వినన్నపేట గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సీఐ ఎం.వినోద్‌బాబు ఆదివారం అందించిన వివరాలు... పడమటమ్మ వారి లోవ వైపు నుంచి వినన్నపేట గ్రామానికి వస్తున్న బైక్ మార్గమధ్యంలో మలుపులో మదుం వద్ద అదుపు తప్పి పక్కనున్న గెడ్డలోకి దూసుకుపోయింది. దీంతో బైక్ నడువుతున్న దామరౌతు ఈశ్వరరావు (32), వెనుక కూర్చున్న తూరిబిల్లి భాస్కరరావు (33) గెడ్డలో రాళ్లపై పడిపోయారు. బైక్ కూడా వారి మీద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన వారు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు తెలియజేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాలను వెలికి తీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈశ్వరరావు, భాస్కరరావు కలిసి మెలసి స్నేహంగా తిరుగుతుండేవారు. బహిర్భూమికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

శోకసంద్రంలో..

మృతుడు ఈశ్వరరావు బయ్యవరం వద్ద ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈశ్వరరావు భార్య రమ్య గర్భిణి. కుటుంబానికి జీవనాధారమైన ఈశ్వరరావు మృతితో ఇక తమకు దిక్కు ఎవరంటూ ఆమె రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. భాస్కరరావు వ్యవసాయం చేస్తూ తల్లి నాగమణికి చేదోడుగా ఉంటున్నాడు. ఇంకా వివాహం కాలేదు. ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో ఇక తనకు తోడు ఎవరంటూ నాగమణి రోదిస్తున్నారు.సంఘటన జరిగిన ప్రాంతంలో వీధి లైట్లు లేవు.

ఈ ప్రాంతమంతా చీకటిగా ఉండడంతో పాటు మదుం వద్ద రక్షణ గోడ లేకపోవడం ప్రమాదానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. ఈశ్వరరావు భార్య రమ్య ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొట్టి యువకుడి మృతి

తీవ్రంగా గాయపడిన బాలుడు


వీరబాబు(ఫైల్)

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని కృష్ణాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ కుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. కశ్లెంపూడికి చెందిన కె.వీరబాబు(28), తన అన్న కొడుకు మదన్‌కుమార్(4)తో కలిసి ద్విచక్ర వాహనంపై బలిఘట్టం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో వీరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ బాలుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
■ విజయనగరం జిల్లా జామి మండలం, జి.సింగవరం గ్రామంలో 1.35 ఎకరాలు సపోటా తోట అమ్మకానికి కలదు. సంప్ర : 90638 90162, 94406 60987, 81062 34196 [V- 36463]

Services

BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455. [T-1262254]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

Wanted
■ మీవద్ద బైక్ ఉంటే, సంపాదన పక్కా..! రూ. 1500/- Day. మన విశాఖ మరియు పరిసర ప్రాంతాలలో..! Benefits : P/F జాబ్, 0% కమీషన్, 25% కొత్త రేట్ కార్డ్, డైలీ/వీక్లీ ఇన్సెంటివ్స్, 5 లక్షల వరకు ఇన్సూరెన్స్. ఫోన్ : 79962 67109, 040-48937612 [V- 12086]

■ Wanted Experienced Marketing Managers with Field work Experience. Preferably MBA or Degree. Cont : 93464 10329 [V- 2576]

■ Priyanka's Vidyodaya High School, Near Neelamma Vepachettu, Vizag. Wanted teachers : 6th - 10th : Maths, English, Computrs, Walk-in- with CV. Cont : 91775 98989, 91779 09966 [V- 9806]

■ Wanted Telecallers (Females) Required Languages (Hindi, English, Telugu, Odiya) Good Salary, GUSM Education Service Center. Ph : 88850 32331, 88861 90901 [V- 12156]

■ మా కంపెనీ కొరకు (65 మంది) స్త్రీలు, (80 మంది) పురుషులు & టెలికాలర్స్ F ఆర్జెంటుగా కావలెను. ఫ్రీ రూమ్ + భోజనం+28000/- వరకు స్పాట్ జాయినింగ్ డైరెక్ట్ జాబ్స్. ఫోన్ 9966310431 [HA-10857]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

यूनियन बैंक యూనియన్ బ్యాంక్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీతమ్మధార-2 బ్రాంచ్
యూనియన్ బ్యాంక్ బిల్డింగ్, ఈనాడు ప్రక్కన, సీతమ్మధార, విశాఖపట్నం-530013. ఆంధ్రప్రదేశ్.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు
[illegible]
తేదీ: 15.05.2024, ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా